క్లుప్తంగా

నేడు ఆరు పథకాలపై నియోజకవర్గ స్థాయి సమీక్ష

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు పథకాలపై బుధవారం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరవుతారని చెప్పారు. సమావేశం అనంతరం బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ ఉంటుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సీఆర్‌పీఎఫ్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాములు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గా నగర్, తుల్జా భవానీ కాలనీ, సీఆర్‌పీఎఫ్ కాలనీ, మైత్రి మెడోస్, స్నేహపురి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, దుర్గా హోమ్స్ పరిధిలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆపిల్ అవెన్యూ ఫీడర్...

ఆపిల్ అవెన్యూ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయ 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మిధానీ కాలనీ, నీలాద్రి నగర్, బాలాజీ నగర్, లక్ష్మీ నగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య నగర్, ఇంజాపూర్ గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

ఇంజాపూర్ గౌడ సంఘం ఏకగ్రీవం



ఇంజాపూర్ గౌడ సంఘం సభ్యులు

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్‌లో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.పాపయ్య, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి భిక్షపతి, కార్యదర్శిగా బి.శంకరయ్య, డైరెక్టర్లుగా బూడిద లక్ష్మమ్మ, పల్చం అరుణ ఎన్నికయ్యారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎంపీ మల్లు రవికి ఆహ్వానపత్రిక అందిస్తున్న శ్రీనివాసమూర్తి

ఆమనగల్లు: తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల గ్రామంలో ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు జరిగే శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి నగరంలోని ఎంపీ నివాసంలో మల్లు రవికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నాయకులు అశోక్‌బాబు, నర్సింలు, అజీజ్ తదితరులు ఉన్నారు.

మ్యాన్ హోల్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: 'ఆదమరిస్తే అంతే'శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి కొంగరకలాన్ చౌరస్తా నుంచి బ్యాంకు వైపు వెళ్లే మార్గంలో నడి రోడ్డుపై మ్యాన్ హోల్ కుంగింది. దీంతో అటుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించి మంగళవారం మరమ్మతులు చేయించారు. దీంతో మున్సిపల్ అధికారుల పనితీరును చూసి ప్రజలు హర్షించారు.

సాక్షి విజిట్

వండిందే మెనూ..

- మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తం
- బిల్లులు అందక నిర్వాహకులు ఇబ్బందులు
- రుచి, శుచి లేక ఇంటి నుంచే లంచ్ తెచ్చుకుంటున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజన పథకం అమలు అస్తవ్యస్తంగా ఉందని విద్యాశాఖ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు పరిధిలో 'సాక్షి' విజిట్ నిర్వహించగా పలువిషయాలు వెలుగులోకి వచ్చాయి. మధ్యాహ్న భోజన సిబ్బంది వడ్డిస్తున్న అన్నం సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మెనూ ప్రకారం వారానికి మూడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా ధరల పెరుగుదలతో వారు ఒకటి, రెండు మార్లే ఇస్తున్నారు. మరో వైపు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నిర్వహణ భారంగా మారిందని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. రుచి లేకపోవడంతో సగం మందికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉంటున్నారు.

అప్పు చేసి మధ్యాహ్న భోజనం

- బిల్లులు అందక ఇబ్బందులు
- ప్రభుత్వ చెల్లింపులతో మెనూ పాటించలేమంటున్న సిబ్బంది



కుర్మిద్ద జెడ్పీహెచ్ఎస్‌లో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

యాచారం: నూటికి రూ.2.50 చొప్పున వడ్డీలు తీసుకువచ్చి మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వంట ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. మంగళవారం కుర్మిద్దలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 'సాక్షి' విజిట్ నిర్వహించగా పలువిషయాలు వెలుగులోకి వచ్చాయి. జెడ్పీహెచ్ఎస్‌లో 123 మంది, ప్రాథమిక పాఠశాలలో 76 మంది విద్యార్థులున్నారు. వంట సిబ్బంది పార్వతమ్మ మాట్లాడుతూ.. ఏడు నెలలుగా బిల్లులు అందక వడ్డీకి తీసుకువచ్చి భోజనం అందిస్తున్నామన్నారు. మార్కెట్‌లో గుడ్డు ధర పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో వారానికి(సోమ, బుధ, శుక్ర) మూడు గుడ్లు ఇవ్వడం ఇబ్బందిగా ఉందన్నారు. గౌరవ వేతనం సైతం అందడం లేదని చెప్పారు. ఇదే విషయమై పాఠశాల హెచ్ఎం పాండురంగారెడ్డిని సంప్రదించగా మధ్యాహ్నం భోజనం బిల్లులు 2024 డిసెంబర్ వరకు అందినట్లు ఎంఈఓ కార్యాలయం నుంచి సమాచారం ఉందన్నారు.

ఏడాది నుంచి దూరం



నీళ్ల చారులా వంకాయ కూర



ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు తింటున్న చిన్నారులు



ఉడకని అన్నం

మెనూ పాటించని నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన పథకం పంపిణీ అస్తవ్యస్తంగా మారుతోంది. అధికారులు, ఉపాధ్యాయులు ఎంత చెప్పినా నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు. ఇక్కడ తిండి తినలేం.. అన్నం బాగుంటే కూర బాగోదు. రెండూ ఉంటే గుడ్డు ఉండదంటూ విద్యార్థులు వాపోతున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనిది ఈ దుస్థితి.

190 మందికి 40 మంది విద్యార్థులే

కొంగరకలాన్ జెడ్పీహెచ్ఎస్‌లో 190 మంది విద్యార్థులున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సోమ, బుధ, శుక్ర వారాల్లో గుడ్డు అందించాలి. కానీ సోమవారం పరిశీలనకు వెళ్లగా గుడ్డు ఇవ్వలేదు. ఉడికీ ఉడకని అన్నంతో పాటు నీళ్ల చారు వంకాయ కూర వడ్డించారు. నిత్యం ఇదే మెనూ పాటిస్తున్నారని విద్యార్థులు ఏడాది నుంచి పాఠశాలలో భోజనం చేయడం మానేశారు. ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో నిత్యం 40 మంది కూడా భోజనం చేయరని విద్యార్థులు చెబుతున్నారు. అన్నం, కూరలు రుచిగా ఉండవని.. గుడ్డు ఇవ్వరని.. అంబలి మాత్రం రోజు పెడుతున్నారని చెబుతున్నారు.

యాభై శాతమే..

- మిగిలిన వారు ఇంటి నుంచే బాక్సులు



లంచ్‌బాక్స్ తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం అమలు చేస్తోంది. ఇక్కడ 50 శాతం మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మిగిలిన వారంతా ఇంటి నుంచే లంచ్ బాక్సులు తీసుకొచ్చుకుని తింటున్నారు. ఉడికీ.. ఉడకని అన్నం.. రుచిలేని కూరల కారణంగా విద్యార్థులు ఈ భోజనానికి దూరంగా ఉంటున్నారు. కార్మికులకు అందిస్తున్న నిధులు సరిపడక నాణ్యత పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇబ్రహీంపట్నం జెడ్పీహెచ్ఎస్‌లో 450 మంది విద్యార్థులకు గాను 200 మందికి లోపే మధ్యాహ్న భోజనం స్వీకరిస్తున్నట్లు తెలుస్తోంది.

కూరలు రుచిగాలేవు



అన్నం బాగానే ఉంటున్న కూరలు రుచి ఉండడం లేదు. సన్న బియ్యంతో భోజనం పెడుతున్నా అప్పుడప్పుడు సరిగా ఉడకం లేదు. ఆకలిని తీర్చుకునేందుకు తప్పక భోజనం చేస్తున్నాం. వారానికి మూడు రోజులు గుడ్డు ఇస్తున్నారు.

– ఎం.సన్ని, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్, ఇబ్రహీంపట్నం

మెనూ ప్రకారమే భోజనం



మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిపి కమిటీ వేశాం. మధ్యాహ్నం భోజనం చేసే వారి వివరాలు హాజరు సమయంలో నమోదు చేసుకుంటాం. సగం మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉంటున్నారు. వంట సమయంలో సరుకులు, తాగునీటిని పరిశీలిస్తాం. సకాలంలో బిల్లులు అందక ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

– వెంకట్‌రెడ్డి, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, ఇబ్రహీంపట్నం

ఫుడ్.. వెరీ 'గుడ్డు'



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

కడ్తాల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్(బాలుర) పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. మంగళవారం 284 మంది విద్యార్థులకు గాను 185 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం బీరకాయ పప్పు, సాంబార్‌తో కూడిన ఆహారం అందించారు. విద్యార్థులకు ఫిల్టర్ వాటర్ అందిస్తున్నారు. పాఠశాలలో డైనింగ్ హాలు లేక పాఠశాల మైదానంలోనే ఆరగిస్తున్నారు. వారానికి మూడు రోజులు గుడ్డు, అరటి పండ్లు అందిస్తున్నట్లు విద్యార్థులు చెప్పారు. డిసెంబర్ వరకు ఏజెన్సీ బిల్లులు వచ్చినప్పటికీ మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వంట సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.



కడ్తాల్: సన్నాహక సదస్సుకు వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

'వర్గీకరణ చేసే వరకు పోరాడుతాం'



మంచాల: ఆరుట్ల నుంచి వెళ్తున్న ఎమ్మార్పీఎస్‌నాయకులు

కడ్తాల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కేంద్రం నుంచి పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. వర్గీకరణ చేసేంత వరకు పోరాడుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షులు నరేశ్, నర్సింహ, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు దాస్, నాయకులు లక్ష్మయ్య, కృష్ణ, రమేశ్ కుమార్ ఉన్నారు.

ఉద్యమం కొనసాగిస్తాం

మంచాల: ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జేఏసీ ఇబ్రహీంపట్నం చైర్మన్ భాస్కర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరుట్లలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మహేశ్వరంలో నిర్వహిస్తున్న సన్నాహక సమావేశానికి తరలివెళ్లారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ జేఏసీ ఉపాధ్యక్షుడు యాదయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్, నాయ కులు సూర్యం, యాదయ్య, శ్రీను, యాదగిరి, నాగరాజు, సుదర్శన్, సురేశ్, తరుణ్, మహేశ్, బుచ్చయ్య, లక్ష్మణ్, జగన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఆహ్వానం



ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీకంఠ మహేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించే శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు హాజరవ్వాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌లను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో వారి నివాసాలలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్‌గౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, నాయకులు దుసకంటి యాదయ్య, సతీష్‌గౌడ్ ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తుర్కయంజాల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రాగన్నగూడ అధ్యక్షుడు సామ భీంరెడ్డి అన్నారు. మన్నెగూడలోని బస్తీ దవాఖానాలో సియాన్ క్యాన్సర్ క్లినిక్స్, హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలువురు కాలనీ వాసులు పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, కోశాధికారి శంకరయ్య గౌడ్, సభ్యులు వెంకటేశ్వర రావు, మహేందర్‌రెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది రోడ్లు.. రూ.15.59 కోట్లు

- రోడ్ల ఆధునీకరణ, మరమ్మతులకు నిధులు మంజూరు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పంచాయతీరాజ్ విభాగంలో గ్రామీణ రోడ్ల ఆధునికీకరణ, మరమ్మతు పనులకు ప్రభుత్వం ఎంఆర్ఆర్ గ్రాంట్ నుంచి తొమ్మిది రోడ్లకుగాను రూ.15.59 కోట్లు మంజూరు చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామీణ రోడ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయని.. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులకు రూ.500 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి వివిధ పథకాల క్రింద రూ.310 కోట్లు మంజూరైనట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందిస్తున్నామని ఆయన వివరించారు. భూమిలేని నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందజేస్తున్నామని చెప్పారు.

అభివృద్ధికి ఆచారి కలిసిరావాలి

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి తనతో కలిసిరావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. తనకు ఎవరిపై ద్వేషం, బేషజాలు లేవని తన ధ్యేయం తన సంకల్పం కల్వకుర్తి అభివృద్ధే అని చెప్పారు. ఎమ్మెల్యేగా ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావిస్తున్నానన్నారు. అభివృద్ధి విషయంలో అందరూ కలసికట్టుగా తోడై ఈ ప్రాంతవాసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి ప్రత్యేక నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కిషన్‌రెడ్డి, నారాయణ, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్, మాజీ అధ్యక్షుడు రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు హన్మానాయక్, మానయ్య, రమణారెడ్డి, శ్రీకాంత్, ఫరీద్, అలీం, నాజర్, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, జవహర్‌లాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండల ఏర్పాటుకు వినతి

మాడ్గుల: మండల పరిధిలోని ఇర్విన్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అఖిల పక్ష పార్టీల నాయకులు మంగళవారం కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వాయర్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఇర్విన్ మండలం ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాల ప్రజల సమస్యలు తీరుతాయని ప్రభుత్వం వెంటనే మండల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు అఖిల పక్షం నాయకులు తెలిపారు.

నిధుల వివరాలు

అభివృద్ధి చేయనున్న రోడ్డు	మంజూరైన నిధులు
ఇర్విన్–కుర్మేడ్	రూ.2.40 కోట్లు
చరికొండ–పల్లెచెల్క తండా	రూ.1.18 కోట్లు
గట్టుఇప్పలపల్లి–జూలపల్లి	రూ.2.41 కోట్లు
అందుగుల–పల్లెతండా	రూ.2 కోట్లు
చింతపల్లి–మెదక్‌పల్లి	రూ.1.96 కోట్లు
ఆర్అండ్‌బీ రోడ్– అందుగుల	రూ.1.80 కోట్లు
బాలాజీనగర్–రేకులకుంటతండా	రూ.93 లక్షలు
పోలెపల్లి గేటు–మంగళికుంట తండా	రూ.కోటి
తలకొండపల్లి–రావిచేడ్	రూ.1.90 కోట్లు

మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు సన్మానం

కడ్తాల్: మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డిని మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను శ్రీనివాస్ గుప్తా గంగారెడ్డికి వివరించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు గంప శ్రీనివాస్‌గుప్తా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమేశ్, నాయకులు రాములుగౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.



గంగారెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ విజయంలో ఆర్టీసీ కార్మికులది కీలకపాత్ర

- ఆర్టీసీ ఆస్తుల అమ్మకానికి బీఆర్ఎస్ కుట్ర చేసింది
- రాష్ట్ర రోడ్డు డెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసి సంస్థ ఆస్తులను అమ్మేయాలని కుట్ర చేసిందని, సంస్థను కాపాడుకునేందుకు కార్మికులు చేసిన పోరాటానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషించారని రాష్ట్ర రోడ్డు డెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు అందించిన సహకారం మరువలేనిదని వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు అందేలా చూస్తామన్నారు. రిటైర్డ్ కార్మికుల భవనం కోసం జీహెచ్ఎంసీ పరిధిలో వెయ్యి గజాల స్థలాన్ని గుర్తిస్తే భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని లేకుంటే తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి గజాల స్థలాన్ని ఇప్పించేందుకు తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. లగ్జరీ బస్సుల్లో రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు రెండు సీట్లను కేటాయించేందుకు రవాణా శాఖ మంత్రితో చర్చిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ రహమాన్ సోఫీ, కోటయ్య, బుచ్చిరెడ్డి, ఆనందం, రాజయ్య, పిఎస్ఎన్ రావు, అయ్యన్నగౌడ్, పాండు రంగారావు పాల్గొన్నారు.